క్లుప్తంగా

నేటి ధర్నాకు తరలి రావాలి

మండపేట: ఎస్సీ ఎస్టీ సంక్షేమ అభివృద్ధి పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సఖినేటిపల్లి వంతెన వద్ద నిర్వహించే ధర్నాకు పార్టీ శ్రేణులు తరలి రావాలని డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు కోరారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే ధర్నాకు పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు జంగా గౌతమ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ధర్నా అనంతరం పార్టీ జిల్లా సమావేశం జరుగుతుందని, జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కామన శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ఘనంగా లక్ష మల్లెల పూజ


లక్ష మల్లెల పూజలో వేంకటేశ్వరస్వామివారు

మండపేట: పట్టణంలోని కలువ పువ్వు సెంటర్‌లో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం లక్ష మల్లెల పూజ వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజల అనంతరం సుగంధ ద్రవ్యాలతో మహాభిషేకం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీపుష్పయాగం నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు.

ప్లాస్టిక్ అనర్థాలపై కళాజాత


ప్లాస్టిక్ అనర్థాలపై కళాజాత ద్వారా అవగాహన చేస్తున్న విభూతి కల్చర్ సొసైటీ

రామచంద్రపురం: జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు విభూతి కల్చరల్ సొసైటీ వారు ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు కళాజాతల ద్వారా అవగాహన కార్యక్రమాలను పట్టణంలోని పలు ప్రాంతాలల్లో శుక్రవారం నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం మూలంగా ఏర్పడే వాతావరణం మార్పులు, తదనుగుణంగా ఏర్పడే వ్యాధులు తదితర వాటిపై మేజిక్స్, హాస్య సన్నివేశాలతో ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. విభూతి శ్రీనివాసరాజు, ఉపేంద్ర, పద్మావతిలు ఈ కళాజాతలను నిర్వహించారు.

5న డ్రాయింగ్ పోటీలు

కె.గంగవరం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యా శాఖ ఆదేశాల మేరకు ఈ నెల 5న డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ అకడమిక్ కో ఆర్డినేటర్ పీవీ బ్రహ్మానందం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మన గంగవరం చారిటబుల్ ట్రస్ట్, రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి సంయుక్త సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని ఆసక్తి గల వారు నాలుగో తరగతి నుంచి డిగ్రీ వరకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు. పూర్తి వివరాలకు కె.గంగవరం ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం


పనులు ప్రారంభించడానికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు

కె.గంగవరం: మండల పరిధిలోని కోటిపల్లిలో కొలువైన ఛాయా సోమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులకు శుక్రవారం దాతల సహాయంతో శ్రీకారం చుట్టారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డిప్యూటీ లేబర్ కమిషనర్ వి.శ్రీనివాస్ ఆలయ అభివృద్ధికి ముందుకు వచ్చి సుమారు రూ.4 లక్షలు వెచ్చించారు. ఆ నిధులతో ఆలయంపై గల మండలం ప్లాస్టింగ్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ పనులకు ఆలయ అర్చకుల ప్రత్యేక పూజలు చేసి దాత శ్రీనివాస్‌తో పనులు ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను), గ్రామ పెద్దలు పెమ్మాడి సత్తిబాబు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఏరుపల్లికి చెందిన బొమ్మ పెద సత్యనారాయణ (62) రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ద్రాక్షారామ అడిషనల్ ఎస్సై ఎన్.సత్య భుజంగరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పెద సత్యనారాయణ మే 30న ద్విచక్ర వాహనంపై తాళ్లపొలం వెళ్తుండగా కంచి పేట వద్దకు వచ్చేసరికి కుక్క అడ్డురావడంతో రోడ్డుపై పడిపోయి గాయాల పాలయ్యాడు. స్థానికుల సమాచారంతో అతని కుమారుడు వీరబాబు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించాడు. అక్కడి వైద్యులు చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 1న మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారం, కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

ఫైడే

- అటు వడగాడ్పులు.. ఇటు ఉక్కబోత
- పగటి పూట బయటకు వెళ్లేందుకు జడుస్తున్న జనం


భానుడి భగభగలతో ఉదయం 11 గంటలకే పసలపూడి వద్ద నిర్మానుష్యంగా మారిన మండపేట-కాకినాడ ప్రధాన రహదారి

రాయవరం: భానుడు భగభగలాడుతున్నాడు. వాతావరణం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. రోహిణి కార్తె ప్రారంభం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. దాంతో ప్రజలు వేడిని తట్టుకోలేక విలవిల్లాడుతున్నారు. శుక్రవారం కూడా అత్యధికంగా 42 డిగ్రీలు, అత్యల్పంగా 29 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ 45 డిగ్రీల పైబడినట్టుగా అనుభూతి కలుగుతోంది. వేసవి తాపానికి ప్రజలు తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. నాలుగు రోజుల క్రితం అడపా దడపా ఈదురుగాలులు, వర్షాలు కురవడంతో కొంత వాతావరణం చల్లబడి ప్రజలు ఉపశమనం పొందారు. అయితే రెండు, మూడు రోజుల నుంచి సూరీడు చుర్రుమంటున్నాడు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని ప్రజలు ఎండ వేడి, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఆపసోపాలు పడుతున్నారు.


మండే ఎండలకు తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రయాణిస్తున్న వాహనదారులు

ఎండలు ఎక్కువే

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎండలు కాస్త ఎక్కువగానే ఉన్నాయి. వేసవి ప్రారంభానికి ముందుగానే ఈ ఏడాది ఎండలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. వేసవి ప్రారంభమైన ఫిబ్రవరి, మార్చి నెలల నుంచే వేసవి తాపం పెరిగింది. ఏప్రిల్, మే నెలల్లో ఎండ వేడిమి అధికంగా ఉండడంతో ప్రజలు బయట తిరిగేందుకు అవస్థలు పడ్డారు. సాధారణంగా జూన్ ప్రారంభంలో నైరుతి రుతుపవనాల రాకతో వాతావరణం చల్లబడుతుంది. అయితే నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో ఈ ఏడాది జూన్ మొదటి వారంలో కూడా భానుడు భగభగలాడుతున్నాడు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకెళ్లాల్సిన వారు అన్ని రక్షణ చర్యలు తీసుకుని కూడా ఇంటి నుంచి అడుగు బయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. రెండు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు మరింతగా పెరగడంతో ఎండలతో పాటు ఉక్కపోత కూడా పెరిగింది. ఎండవేడిమితో పాటు వడగాడ్పులు, ఉక్కపోతతో ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఎండవేడికి ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. మండే ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు కూలర్లు, ఏసీలు, ఫ్యాన్ల వాడకాన్ని పెంచేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ఎండ వేడితో చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధిక ఉష్ణోగ్రతతో పాటు ఉక్కపోత వాతావరణంతో బయట తిరగలేక పోతున్నాం. దాహార్తిని తీర్చుకోవడానికి పండ్ల రసాలను వినియోగిస్తున్నాం.
– పలివెల రవిబాబు, చిరుద్యోగి, కూర్మాపురం, రాయవరం మండలం

బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది



మండే ఎండలతో బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఉంది. ఉదయం తొమ్మిది గంటల లోగానే పనులు పూర్తి చేసుకుంటున్నాం. రాత్రి ఏడు గంటలకు కూడా ఉక్కపోత తగ్గడం లేదు. నైరుతి రుతుపవనాలు వస్తేనే ఊరట లభిస్తుంది.
– మేడపాటి నారాయణరెడ్డి, రిటైర్డ్ ఉద్యోగి, మాచవరం, రాయవరం

రామచంద్రపురంలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత

రామచంద్రపురం: రోహిణీ కార్తెలో ఎండలు మంట పుట్టిస్తున్నాయి. ఈ ఏడాదిలో మొదటి సారిగా శుక్రవారం నాడు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయింది. గత రెండు రోజులుగా ఎండలు మండిపోతుండగా తాజాగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఉదయం 8 గంటల నుంచి ఎండ వేడిమి రాగా సాయంత్రం 5 గంటలకు కూడా 42 డిగ్రీల ఉష్ణోగ్రతలున్నాయి. సాయంత్రం 7 గంటల వరకు చీకటి పడలేదు. రాత్రి సమయంలో కూడా ఉష్ణోగ్రత అధికంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండ వేడిమికి ప్రజలు ఉక్కిరి బిక్కిరికి లోనవుతున్నారు. దీనికి తోడు ఏసీలు అధికంగా ఉపయోగించటంతో ప్రతి చోట విద్యుత్ లోవోల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయి.

ప్రతి కౌలు రైతుకు గుర్తింపుకార్డు ఇవ్వాలి


దుగ్గుదుర్రులో చిట్టిబాబు కుటుంబీకులను పరామర్శిస్తున్న రాజబాబు తదితరులు

కాజులూరు: భూ యజమానితో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి రైతుకు రెవెన్యూ అధికారులు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. మండలంలోని దుగ్గుదుర్రులో పురుగుమందు తాగి మృతి చెందిన జోగి చిట్టిబాబు కుటుంబీకులను శుక్రవారం రాజబాబు తదితర కౌలురైతు సంఘ నాయకులు పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు ఎనిమిదివేల మంది కౌలు రైతులు ఉండగా అధికారులు నాలుగువేల మందికి మించి కార్డులు ఇవ్వడం లేదన్నారు. కౌలుకార్డులేని కారణంగా జోగి చిట్టిబాబు వంటి కౌలు రైతులు అప్పుల భాధతో మృతి చెందినప్పటికీ పరిహారానికి ఎంపిక కాలేకపోతున్నారన్నారు. అధికారులు విచారణ చేపట్టి జోగి చిట్టిబాబు కుటుంబీకులకు తగిన న్యాయం చేయాలన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయంగా పాలన


మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- మండపేట 18వ వార్డులో గడప గడపకూ..

మండపేట: పేదల అభ్యున్నతి ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. పట్టణంలోని 18వ వార్డులో శుక్రవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ నాయుడు లక్ష్మీసౌజన్య అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ శ్రేణులతో కలసి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. గత నాలుగేళ్ల జగన్ పాలనలో ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాల వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు ఆయన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను అక్కడికక్కడే మున్సిపల్ కమిషనర్ టి.రామ్ కుమార్‌తో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో టీడీపీ పాలనలో పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ముడుపులు చెల్లిస్తేనే కాని ప్రభుత్వ పథకాలు అందని దుస్థితి ఉండేదన్నారు. సీఎం జగన్ వచ్చాక ఎటువంటి అవినీతికి తావులేకుండా వలంటీర్లు తలుపుతట్టి ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నారని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్య, విప్ పోతంశెట్టి ప్రసాద్, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, యర్రగుంట అయ్యప్ప, ముక్కా సుబ్రహ్మణ్యం, ముక్కా దాలయ్య, కోళ్ల అయ్యప్ప, పెంకే గంగాధర్, యాంద్ర బుజ్జి, కిరణ్ గౌడ్, మలసాని అప్పన్న, యాళ్ల శ్రీను, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


29వ వార్డులో కళాజాతా నిర్వహిస్తున్న దృశ్యం

మండపేట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, మేరీ లైఫ్-మేరా స్వచ్ఛ నగర్ కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరు సహకరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య కోరారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేరీ లైఫ్ - మేరా స్వచ్ఛనగర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక 29వ వార్డులో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ పాత వస్తువుల సేకరణ కోసం పట్టణంలోని అన్ని సచివాలయాల వద్ద రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రజలు, సంస్థలు చైతన్యవంతులై తమ వద్ద నిరుపయోగంగా ఉన్న పుస్తకాలు, దుస్తులు, చెప్పులు, టోపీలు, దుప్పట్లు, బ్యాగులు, సైకిళ్లు, కుర్చీలు, ఎలక్ట్రికల్, ప్లాస్టిక్ వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లకు అందజేయాలని కోరారు. ఆయా వస్తువులను అవసరమైన వారికి అందజేయడం జరుగుతుందన్నారు. మిగిలిన వాటిని రీ సైక్లింగ్‌కు పంపుతామన్నారు. పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

'జన్ భాగిధారి' విజయవంతం చేయాలి

డీఈవో కమలకుమారి



రాయవరం: జిల్లాలోని అందరు మండల విద్యాశాఖాధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంయుక్త భాగస్వామ్యంతో 'జన్ భాగిధారి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఎం.కమలకుమారి కోరారు. జిల్లాలోని ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్‌లో భాగంగా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహించాలన్నారు. జీ- 20 ఎడ్యుకేషన్ వర్క్ గ్రూపు (జీ-20ఎడ్యుకేషన్ డబ్ల్యూజీ) కార్యక్రమంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, డిజిటల్ విద్యపై కృత్యాలను నిర్వహించాలని, ప్రతి మండలం నుంచి బెస్ట్ ఆఫ్ త్రీని ఎంపిక చేయాలన్నారు. పాఠశాల స్థాయి అనంతరం మండల స్థాయిలో కూడా దృశ్య, శ్రవణ పరికరాలను ఉపయోగించి, బోధనోపకరణాలు తయారు చేయడం, విద్యార్థులతో స్టోరీ టెల్లింగ్, రంగోలీ, క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించాలన్నారు. మండలస్థాయిలో బెస్ట్ ఆఫ్ త్రీని ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపించాలన్నారు. ఈ నెల 6లోగా పాఠశాల, మండల స్థాయి పోటీలు నిర్వహించాల్సి ఉందన్నారు. 'జన్ భాగిధారి' కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలు అత్యంత ప్రాధాన్యతాంశంగా భావించాలని డీఈవో కమలకుమారి సూచించారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం



శోభాయాత్ర నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు

మండపేట: ఛత్రపతి శివాజీ 350వ పట్టాభిషేక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) మండపేట శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హిందూ సామ్రాజ్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముత్యాల చక్రవర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖుడు కర్రి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హిందూ ధర్మాన్ని, సంస్కృతిని, హిందూ సమాజాన్ని సంరక్షించిన వారిలో శివాజీ అగ్రగణ్యుడన్నారు. తన శౌర్య పరాక్రమాలతో భారతీయుల గుండెల్లో శివాజీ చెరగని ముద్ర వేసుకున్నారని కొనియడారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి రథం గుడి, వల్లూరివారి వీధి మీదుగా శోభాయాత్ర చేశారు. మేడవరపు నరసింహం, కందుల సాంబశివ ప్రసాద్, రిమ్మలపూడి శ్రీనివాస చౌదరి, రామానుజన్, మాడా శ్రీనివాసరావు, కోన సత్యనారాయణ ,కోటిపల్లి సాయిరాం, బలుసు శ్రీనివాసు, మద్దుల సుబ్బారావు, జేసీ ప్రసాదు ,రుద్రశర్మ, గాడేపల్లి శ్రీనువాస్, గొడవర్తి రామచంద్రరావు, స్వయంసేవక్ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైనేజీల ప్రక్షాళన



డ్రైనేజీల్లో సిల్ట్ తీసే పనులను ప్రారంభించిన చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు

రామచంద్రపురం: ఎంతో కాలంగా మూసుకుపోయిన డ్రైనేజీల ప్రక్షాళ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరు వైపుల ఉన్న ప్రధాన మురుగుకాలువల్లోని సిల్ట్ తీసే పనులను చైర్‌పర్సన్ శ్రీదేవి శుక్రవారం ప్రారంభించారు. స్థానిక వీఎస్‌ఎం కళాశాల నుంచి రాజగోపాల్ సెంటర్ వరకు, ఇరువైపులా, రాజగోపాల్ సెంటర్ నుంచి కాకినాడ రోడ్డు, ద్రాక్షారామ రోడ్డుకు ఇరువైపులా ఉండే డ్రైన్లలోని సిల్ట్‌ను రూ.23 లక్షలతో శుభ్రం చేయనున్నారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్ట్యా ప్రధానడ్రైన్లలోని పూడిక తీతను తీస్తున్నట్లు చెప్పారు. ఆరేళ్లుగా ఎటువంటి సిల్ట్ తీయకపోవటంతో ప్రధాన మురుగు కాలువలు మూసుకుపోయాయని, దీని మూలంగా పట్టణంలోని లోతట్టు ప్రాంతాలలో నీరు దిగక వర్షాకాలంలో ఎదురువుతున్న సమస్యలను పరిష్కరించేందుకు డ్రైనేజీల ప్రక్షాళన చేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ టి.శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ కొండేపూడి సూర్యకుమారి, మున్సిపల్ డీఈ డి.దుర్గాప్రసాద్, టీపీవో మణిరామ్, పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేత కొండేపూడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ చూపి రూ.50 లక్షల దోపిడీ

రాజానగరం: రిజర్వు బ్యాంకు తీసుకున్న నిర్ణయం మేరకు దేశంలో రూ. రెండు వేల నోట్ల చలామణి నిలిచిపోవడంతో కొందరు అక్రమార్కులు దానిని కూడా తమ అనుకూలంగా మలుచుకుంటున్నారు. అమాయకులను ఎంపిక చేసుకుని దోపిడీకి పాల్పడుతున్నారు. స్థానిక పోలీసు స్టేషను పరిధిలోని కొంతమూరులో ఈ విధంగా ఒక వ్యక్తి నుంచి రూ. 50 లక్షలు తీసుకుని ఉడాయించారు. సీఐ కాశీవిశ్వనాథ్ శుక్రవారం రాత్రి విలేకరులకు తెలిపిన వివరాలిలావున్నాయి. కోనసీమ జిల్లా మండపేటకు చెందిన మాజేటి లక్ష్మీనారాయణ అనే కిరాణా వ్యాపారి అత్యాశకు పోయి రూ. 50 లక్షలు పోగొట్టుకున్నాడు. ప్రస్తుతం రూ. రెండు వేల నోట్ల మార్పిడి కష్టతరంగా మారిందని, ఈ కారణంగా ఆ నోట్లను రూ.60 లక్షలు తీసుకుని, రూ. 500 నోట్లు రూ.50 లక్షలు ఇస్తే చాలని అతడి స్నేహితుడొకరు ఆఫరు ఇచ్చాడు. దీంతో రూ.10 లక్షలు కలిసొస్తుంది కాదా అని లక్ష్మీనారాయణ ఆశపడ్డాడు. ఇంటి నిర్మాణం కోసం అప్పు చేసి ఉంచిన సొమ్ముల నుంచి రూ. 50 లక్షలు తీసుకుని అవతలి వ్యక్తులు (మూర్తి, రామలింగేశ్వర్రావు, ప్రవీణ్)లు చెప్పిన విధంగా గురువారం రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని కొంతమూరు నూకాలమ్మ గుడి వద్దకు చేరుకున్నాడు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఆ వ్యక్తులు పోలీసుల మాదిరిగా హారన్ వేసుకుంటూ వచ్చి, అతడి నుంచి రూ.50 లక్షలు తీసుకుని ఉడాయించారు. తాను దోపిడీకి గురైన సంగతి తెలుసుకున్న లక్ష్మీనారాయణ రాజానగరం పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

బైక్‌పై గ్రంథాలయ ఉద్యమం



యానాం చేరుకున్న గ్రంథాలయ ఉద్యమ బైక్‌యాత్ర, స్వాగతం పలికిన కవి దాట్ల

యానాం: గ్రంథాలయాల ఆవశ్యకతను తెలుపుతూ మంచికంటి వేంకటేశ్వరరెడ్డి చేపట్టిన బైక్ యాత్ర శుక్రవారం యానాం చేరుకుంది. ఆయనకు కవి దాట్ల దేవదానంరాజు, ఉపాధ్యాయుడు ముమ్మిడి చిన్నారి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 10 ఏళ్లగా తాను సాహిత్య రచన, కథాకవిత్వం, నవల తదితరమైనవి మంచికంటి పేరుతో రాస్తున్నానన్నారు. అయితే పాఠశాలల్లో గ్రంథాలయాలు లేని పరిస్థితిని గమనించానన్నారు. తాను ఒక బస్సు ద్వారా ఒక ఏడాది చీమకుర్తి మండలంలో సంచార గ్రంథాలయాన్ని నిర్వహించినట్లు తెలిపారు. తాను రాష్ట్రవ్యాప్తంగా కవులు, రచయితలు, మిత్రులతో కలిసి గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్మించబోతున్నానని తెలిపారు. టీటీడీ సభ్యుడు మల్లాడి కృష్ణారావును, మధునాపంతుల సత్యనారాయణను కలిసినట్లు తెలిపారు. గత నెల ఈ యాత్రను 19న ఒంగోలులో కలెక్టర్ ప్రారంభించగా నెల్లూరు, చిత్తూరు, తిరుపతి మీదుగా రాయలసీమ జిల్లాల్లో పర్యటించి విజయవాడ నుంచి ఏలూరు, తణుకు, అమలాపురం మీదుగా యానాం వచ్చినట్లు తెలిపారు. యానాం

వ్యక్తి అదృశ్యంపై కేసు


అదృశ్యమైన డాక్టర్ వివేక్

యానాం: వ్యక్తి అదృశ్యంపై యానాం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేరు నూకరాజు ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు మండల పరిధిలోని శంకరపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ చిక్కం వివేక్ అనే 34 సంవత్సరాల వ్యక్తి ఈనెల 1 వ తేదీన యానాం బైపాస్ రహదారి జంక్షన్‌కు వచ్చి అక్కడ నుంచి అదృశ్యమయ్యాడని తెలిపారు. కుటుంబ సభ్యులు ఆయన ఆచూకీ కోసం గాలించినప్పటికీ దొరకలేదని తెలిపారు. ఆయన గతంలో కోనసీమ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యుడిగా సేవలు అందించారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే యానాం ఎస్పీ ఫోన్ నంబరు 0884–2324800, సిఐ 0884–2321210కు తెలియజేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్టు కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు యానాం బైపాస్ రహదారిలోని గణపతి నగర్ వద్ద ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కాకినాడ ఏటిమొగ గ్రామానికి చెందిన సూరేటి రాజు, కొరిమెల్ల మహేష్‌లకు గాయలైనట్లు తెలిపారు. వీరిని హుటాహుటిన కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. వీరిలో రాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చెరువుల అక్రమ తవ్వకాలను అడ్డుకున్న అధికారులు


అధికారుల జోక్యంతో ఆగిన చెరువుల పనులు

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కందికుప్ప పంచాయతీ గాజింగి తిప్ప సమీపంలోని గరువుపేటలో నాన్ ఆక్వా జోన్ పరిధిలో ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా తవ్వేస్తున్న చెరువుల పనులను రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు అడ్డుకున్నారు. 'అనుమతులు లేకుండా చెరువులు అనధికారిక తవ్వకాలు' పేరిట సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు స్పందించి పనులను నిలిపివేశారు.

గొల్లపాలెంలో కింగ్‌కోబ్రా కలకలం


గొల్లపాలెంలో స్థానికుల చేతిలో హతమైన పాము

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో కింగ్ కోబ్రా కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన సన్నపు రాజారావు శుక్రవారం రాత్రి ఉక్కబోతకు తాళలేక తన ఇంటి అరుగుపై మంచం వేసుకుని పడుకున్నాడు. నిద్రిస్తున్న సమయంలో మంచం కింద సుమారు 10 అడుగుల పాము కదులుతూ కనిపించటంతో అతను గమనించి కేకలు పెట్టాడు. పరిసర కుటుంబీకులు వచ్చి చాకచక్యంగా అందరూ కలసి పామును మట్టుబెట్టారు. అయితే కింగ్ కోబ్రా జాతికి చెందిన ఈ తరహా పాములు మెట్ట ప్రాంతంలోనే ఎక్కువగా పెరుగుతుంటాయని గొల్లపాలెం, కుయ్యేరు రోడ్డు నిర్మాణం సం ఇటీవల మెట్ట ప్రాంతం నుంచి తీసుకువచ్చిన గ్రావెల్‌మట్టి ద్వారా ఇవి డెల్టా ప్రాంతానికి వచ్చి ఉంటాయని రైతులు చెబుతున్నారు. నునుపైన చర్మంతో ఆకర్షణీయంగా ఉన్న ఈ పామును చూసేందుకు అధిక సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చారు.

రైతులకు ఆదాయ వనరుగా 'పాలవెల్లువ'


ద్రాక్షారామ గ్రామ సచివాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న ఏడీ రామకృష్ణ

రామచంద్రపురం రూరల్: వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు పాడి నిత్య ఆదాయ వనరుగా ఉపయోగపడే విధంగా జగనన్న పాల వెల్లువ పథకం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ ఏడీ ఓ.రామకృష్ణ అన్నారు. మండలంలోని ద్రాక్షారామ గ్రామ సచివాలయంలో జగనన్న పాలవెల్లువ పథకంపై సమీక్ష నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏడీ మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ సర్వేను గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది, పశు వైద్య సిబ్బంది సమన్వయంతో త్వరితగతిన, సమగ్రంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్ణీత సమయంలోగా సర్వేను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఎం.కృష్ణార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళను కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు

అయినవిల్లి: పాత గొడవల నేపథ్యంలో ఓ మహిళపై కత్తితో దాడి చేసిన వ్యక్తిపై గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. అయినవిల్లి గ్రామానికి చెందిన నేదునూరు వెంకటలక్ష్మి పొలం నుంచి గేదె పాలు తీసుకుని వస్తుండగా అదే గ్రామానికి చెందిన నొంద్రు సంజీవరావు పాత గొడవల నేపథ్యంలో కాపుకాచి కత్తితో దాడి చేసి గాయపరిచాడు. దీనిపై పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.